పాత బాలారం గ్రామంలో ఇల్లు దగ్ధం : రూ.4 లక్షలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర-కొయ్యూరు : పాత బాలారం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో విజ్జెపు కొండబాబు నివాసానికి భారీ నష్టం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కమ్మల ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యింది. ఆస్తి నష్టం సుమారుగా రూ. 4 లక్షలుగా అంచనా. అయితే, అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.గ్రామస్తులు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేదు అని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో బాధితుడు సర్వం కోల్పోయాడు తనను ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

గసభ సర్పంచ్ సునీత

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : క్రీడలతోనే మానసిక ఉల్లాసమని గసభ సర్పంచ్ పాంగి. సునీత అన్నారు. మండలంలోని గసభ పంచాయితీ మొర్రిగూడ గ్రామంలో శ్రీగంగమ్మ తల్లి గ్రామ దేవత పండగను పురస్కరించుకొని సోమవారం వాలీబాల్ టోర్నమెంట్ ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గసభ పంచాయతీ పరిధిలోని గల క్రీడాకారులు పాల్గొని వారి ప్రతిభను చక్కగా ప్రదర్శించి గెలుపొందిన జట్లకు మంగళవారం బహుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో గసభ పంచాయితీ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, వార్డు మెంబర్స్ సత్యనారాయణ, రాజ్ కుమార్, ఆనంద్ రావు, పీసా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, రామేజీరావు, మొర్రిగూడ పాఠశాల చైర్మన్ రంజిత్ కుమార్, గ్రామ పెద్దలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులుగా టి.మహేష్, కార్యదర్శిగా కె.కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవ సంఘం అల్లూరి జిల్లా కార్యాలయంలో మంగళవారం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎన్నిక లో గౌరవ అధ్యక్షులుగా గండేరు పారిజాతం, అధ్యక్షులుగా తాంగుల మహేశ్వరరావు, కార్యదర్శి కొర్రా కృష్ణారావు, లు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, నూతనంగా కోశాధికారిగా (ట్రెజరర్)గా పాంగి రాంబాబు, ఉపాధ్యక్షులుగా పండు నాయక్, ఎన్నికైనట్లు నూతన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. అనంతరం వారు వేరువేరుగా మాట్లాడుతూ ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం సభ్యులు మాపై ఉన్న నమ్మకంతో ఈ నూతన కార్యవర్గం ఎన్నికలో ఆయా పదవుల్లో మాకు బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందని వారు చెప్పారు.ఈ పదవితో మాకు మరింత బాధ్యతపెరిగిందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో కూడా సంఘం అభివృద్ధి సభ్యుల సమస్యలపై మరింత దృష్టి సారించి కృషి చేస్తామన్నారు. ఈ సంఘం బలోపేతానికి, విస్తృతం కోసం సమిష్టిగా పనిచేస్తామన్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో కూడా నూతన కార్యవర్గం ఎన్నికలు ఏర్పాటు చేసి భవిష్యత్తులో పాత్రికేయుల నెలకొన్న సమస్యలతో పాటు దీర్ఘకాలికంగా ఉన్న ఇళ్ల స్థలాల సమస్యలపై మా వంతు బాధ్యతగా పనిచేస్తామని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శ్రీరామ్,రాజారావు, కోటి బాబు, హర్ష జనపరెడ్డి, దిలీప్ కుమార్, కేశవ్ పడాల్, శ్రావణ్ కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ పద్ధతుల్లో పంట సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర-జి.మాడుగుల : పూర్వపు మాధిరి ఆర్గానిక్ విధానంతో సాగు చేపట్టే రైతాంగానికి ప్రోత్సహిస్తున్నట్లు మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో ఐ.హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం వంతాల పంచాయతీ చింతగొంది గ్రామంలో ఎఫ్‌పీవో ద్వారా రైతులకు వర్మికంపోస్టు వాడుక విధానంపై సూచనలు చేశారు. ప్రకృతి సిద్ధ పంటలపై హనుమంతరావు వివరించారు. అనంతరం సీఎస్ఎం అరుణ మాట్లాడుతూ.. పూర్వపు పెద్దలు మాధిరి పూర్తి సంప్రదాయ పంటలపై దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో రైతులు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో చలి పంజా

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలంలోని చలి తీవ్రత అధికంగా నెలకొంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. ఫలితంగా చలి పంజాకు మండల వాసులు గజగజ వణుకుతున్నారు. సోమవారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 3.9 డిగ్రీలు నమోదైనట్లు చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణం నోడల్ అధికారి డా. ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

బియ్యాలవలసలో ఏనుగుల సంచారం

విశాలాంధ్ర-కురుపాం : మండలంలోని బియ్యాలవలస పరిశరాల్లో సోమవారం ఏనుగులు గుంపు సంచరిస్తూ హల్చల్ చేసాయి. పత్తి, కంది పంటలను నాశనం చేసాయి. ఎప్పుడు గ్రామంలోకి వచ్చేస్తాయో తెలియక బియ్యాలవలస గ్రామస్తులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవిస్తున్నారు. అటవీశాఖ అధికారులు పర్యవేక్షణతో ఎలాంటి ప్రమాదం జరుగకుండా చూడాలని కోరారు.

పీఎమ్‌కేఎస్‌వైడబ్ల్యూటీసి 2.0 పనులు ప్రారంభం

విశాలాంధ్ర- కొయ్యూరు : కొయ్యూరు మండలంలో పీఎమ్‌కేఎస్‌వైడబ్ల్యూటీసి 2.0 ప్రాజెక్ట్ పనులు ప్రారంభమయ్యాయని వాటర్ షెడ్ పథక పిఓ లాలం సీతయ్య తెలిపారు గూడెంకొత్తవీధి కొయ్యూరు క్లస్టర్‌లో మట్టిసంరక్షణ, చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణ, నీటి సమీకరణ వంటి పనులు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు నీటి వనరులు పెరగడంతో పాటు వ్యవసాయానికి ఉపయోగం చేకూరుతుంది అన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. పివో తెలిపారు. దీనివల్ల. 'గ్రామాల్లో సాగు నీరు అందుబాటులోకి రావడం కోసం ఈ పనులు చాలా ఉపయోగపడతాయి' అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా.. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హాజరు అవుతారని. వాటర్ షెడ్ పీఓ లాలం సీతయ్యాట ప్రకటనలో తెలిపారు.

ద్విచక్ర వాహనం డీ... ఒకరు మృతి

విశాలాంధ్ర-చింతపల్లి/జీకే వీధి : ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు జీకే వీధి మండలం అసరాడ గ్రామానికి చెందిన సలిమితి ఈశ్వరరావు (45) రహదారిపై నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఈశ్వరరావు హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకువచ్చే లోపే ఈశ్వర రావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కొట్నాపల్లి గ్రామానికి చెందిన మొట్టడం రాంబాబు అనే వ్యక్తి ద్విచక్ర వాహనం నడిపినట్లు స్థానికులు గుర్తించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

10న ర్యాలీని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-అనంతగిరి : రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 10న అరకులోయలో ఎమ్మెల్యే శ్రీ లిరేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో జరగనున్న నిరసన కార్యక్రమానికి అనంతగిరి మండలంలోని వైఎస్ఆర్సిపి మండల నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ ప్రతినిధులు గిరిజన విద్యావంతులు వివిధ హోదాల్లో ఉన్న మండల నాయకులు హాజరై జయప్రదం చేస్తారని విజ్ఞప్తి చేస్తున్నాం. సుమారు పదివేల మందితో జరిగే ఈ ర్యాలీని జయప్రదం చేసి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకునేలా చేయడమే ధ్యేయంగా కోటి సంతకాల సేకరణ ప్రతులను అదిష్టానానికి అందించి తద్వారా గవర్నర్ కు కోటి సంతకాలను అందజేసే ప్రక్రియ పూర్తి చేయడంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాను.

మన్య ప్రాంత అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

పార్టీలకతీతంగా ఆత్మీయ కలయిక : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంత అభివృద్ధి కోసం ఎన్నికల సమయాలలో తప్ప మిగిలిన అన్ని సమయాలలో రాజకీయ పార్టీలకు అతీతంగా అందరం కలిసి మెలసి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం వి వి ప్రసాద్ అన్నారు. మండలంలోని ఒక శుభ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను పార్టీ శ్రేణులతో పాటు ఇతర పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలు తప్ప మిగిలిన సమయాలలో మనందరి ఎజెండా మన్య ప్రాంత అభివృద్ధి, మన్య ప్రాంత ప్రజల సంక్షేమమే అయి ఉండాలన్నారు. ఇటువంటి శుభకార్యాలలో అందరినీ కలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పీఏసీఎస్ ఛైర్మన్ గెమ్మెల అబ్బాయినాయుడు, వైకాపా మండల ఉపాధ్యక్షుడు వనగల బెన్నిబాబు, రావికమతం మండల విద్యాశాఖ అధికారి లింగ మూర్తి పాల్గొన్నారు.

గిరి పాఠశాలల ఉద్యోగుల వేతనాలు జమ చేయడంలో జాప్యం ఎందుకు?

పిఆర్‌టియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు యు.వి.గిరి, రాష్ట్ర నాయకుడు దేముళ్ళునాయుడు

విశాలాంధ్ర-చింతపల్లి : వేతనాలపై ఆధారపడి జీవిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వాలు సకాలంలో వేతనాలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పిఆర్‌టియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు యు వి గిరి, రాష్ట్ర నాయకులు కె.దేవుళ్ళు నాయుడులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కేవలం వేతనాలపై ఆధారపడి జీవిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వాలు సకాలంలో (ఒకటవ తేదీనే) వేతనాలు జమ చేయాలన్నారు. ఒకటో తేదీ పోయి తొమ్మిదవ తేదీ వచ్చినప్పటికీ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు జమ కాకపోవడంతో పూర్తిగా వేతనాలపై ఆధారపడి వివిధ బ్యాంకుల నుండి వ్యక్తిగత రుణాలతో పాటు, గృహ రుణాలు తీసుకున్న వారికి పెనాల్టీలు పడటమే కాకుండా వారి క్రెడిట్ స్కోరు దెబ్బ తింటుందన్నారు. గత నెల నుండి ఇదే పరిస్థితి కొనసాగుతుందని, రాబోయే నెల నుండైనా ఈ పరిస్థితి తలెత్తకుండా ప్రతినెల మొదటి తేదీన ఉపాధ్యాయుల ఖాతాలలో వేతనాలు జమ అయ్యేలా ప్రభుత్వాలు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఏపీ జిపిఈఏ అసోసియేట్ ప్రెసిడెంట్ గసాడి పద్మనాభం, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు బౌడు గంగరాజు, గెమ్మెల మోహన్ రావు, పి రామరాజు, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగించండి.. మిమ్మల్ని, మీ కుటుంబాన్ని కాపాడుకోండి

డీఎస్పీ షేక్ సహబాజ్ అహ్మద్ పిలుపు

విశాలాంధ్ర-అరకులోయ : నేటి సాంకేతిక యుగములో పెరిగిన స్పీడుతో ఇటీవల కాలంలో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్క వాహనదారులు హెల్మెట్లు ధరించాలని అల్లూరి జిల్లా డిఎస్పి షేక్ సహబాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం అరకులోయ పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎదుట హెల్మెట్ వినియోగంపై జరిగిన బైక్ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. హెల్మెట్ వాడకం మిమ్మల్నే కాకుండా మీ కుటుంబ సభ్యులందరినీ కాపాడుతుందని ఆయన హితబోధ చేశారు. హెల్మెట్ వినియోగం లేకుండా ప్రయాణం కొనసాగించి ప్రమాదాలకు గురై మృత్యువాత పడి కుటుంబాలను అన్యాయం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ వినియోగం మీ ప్రాణాలను కాపాడడమే కాకుండా మిమ్మల్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న మీ కుటుంబ సభ్యులందరినీ కాపాడుతుందని ఈ విషయాన్ని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి మాట్లాడుతూ ప్రచార మాధ్యమాలలో, సోషల్ మీడియాలలో హెల్మెట్ వినియోగంపై ఎంతగా చైతన్యపరుస్తున్న నేటి యువతలో మార్పు రావడంలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. హెల్మెట్ వాడకపోవడం వలన ఇటీవల అరకులోయ సర్కిల్ పరిధిలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని మృత్యువాత పడడం జరిగిందని ఆయన విచారం వ్యక్తం చేస్తారు. అరకు లోయ ఎస్సై గోపాలరావు మాట్లాడుతూ అరకులోయ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎప్పటికప్పుడు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ వాహన చోదకులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్నమన్నారు. అంతకముందు పోలీస్ స్టేషన్ ఎదుట డిఎస్పి షేక్ సహబాజ్ అహ్మద్ వచ్చిపోయే వాహనదారులకు హెల్మెట్ వాడకంపై సంపూర్ణ అవగాహన కల్పించారు. అంతేకాకుండా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి చట్టపరంగా తీసుకునే చర్యలపై హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం హెల్మెట్ వినియోగంపై జరిగిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని వాహనదారులను చైతన్యవంతులను చేశారు. ఈ కార్యక్రమంలో దుంబ్రిగూడ ఎస్సై పాపినాయుడు, అనంతగిరి ఎస్సై డి.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి సమారిటన్ ఆఫ్ నేషన్ స్వచ్ఛంద సంస్థ స్లీపింగ్ బ్యాగులు, మందులు విరాళం

విశాలాంధ్ర-చింతూరు : పేద వర్గాలకు సేవకు చేయడానికి అంకితమైన ప్రఖ్యాత ప్రభుత్వేతర సంస్థ సమారిటన్ ఆఫ్ నేషన్ సోమవారం చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్ సి)లో ఉదారంగా విరాళం ఇచ్చింది. ఈ విరాళంలో శిశువులకు స్లీపింగ్ బ్యాగులతో కూడిన బేబీ బెడ్‌లు, అలాగే రూ. 1 లక్ష విలువైన ముఖ్యమైన డ్రాప్స్, సిరప్‌ల పంపిణీ ఉన్నాయి. ఈ ప్రాంతంలోని శిశువులు, కుటుంబాలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించే ప్రయత్నంలో, ముఖ్యంగా చల్లని వాతావరణ నెలల్లో శిశువుల భద్రత, సౌకర్యం, వెచ్చదనాన్ని నిర్ధారించడానికి ఎన్జీవో స్లీపింగ్ బ్యాగ్‌లు అందించింది. ఈ విరాళాలు నవజాత శిశువుల జీవన పరిస్థితులను మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన ప్రారంభ అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం ఇవ్వడం జరిగింది. బేబీ బెడ్ స్లీపింగ్, ఎన్జీవో బ్యాగులతో పాటు, ఎన్జీవో అవసరమైన వారికి అవసరమైన ఆరోగ్య సంరక్షణ డ్రాప్స్ మరియు సిరప్‌లను పంపిణీ చేసింది, ఇది శిశువుల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న అనేక కుటుంబాలకు ఉపశమనం కలిగించింది. శిశువులలో సాధారణ వ్యాధులకు చికిత్స చేయడంలో సహాయపడటానికి, సమాజానికి మెరుగైన ఆరోగ్యం, శ్రేయస్సును పెంపొందించడం ముఖ్య లక్ష్యం. ఈ కార్యక్రమంలో సమారిటన్ ఆఫ్ నేషన్ ప్రతినిధి రాము మాట్లాడుతూ "మేము బలహీన పిల్లలు మరియు కుటుంబాల జీవితాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉన్నాము, ముఖ్యంగా వనరులకు ప్రాప్యత పరిమితంగా ఉండే గ్రామీణ ప్రాంతాలలో. ఈ రోజు మా విరాళాల ద్వారా, చింతూరులోని శిశువులు , కుటుంబాలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ, సౌకర్యం అందించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము.' అని అన్నారు వారి అచంచలమైన సేవకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కోటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసు గుర్తింపు

సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి

విశాలాంధ్ర-చింతూరు : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నివసించే మడివి లక్ష్మయ్యలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) చింతూరు స్క్రబ్ టైఫస్ ఒక పాజిటివ్ కేసును నిర్ధారించింది. అధిక జ్వరం, శరీర నొప్పుల ఫిర్యాదుల తర్వాత రోగిని పరీక్షించారు. రోగనిర్ధారణ పరీక్షలు స్క్రబ్ టైఫస్‌కు కారణమైన బ్యాక్టీరియా నల్లిగా నిర్ధారించాయి. రోగి ప్రస్తుతం సిహెచ్‌సి చింతూరులో తగిన వైద్య చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలిపారు. స్క్రబ్ టైఫస్ అనేది అటవీ, కొండ లేదా వ్యవసాయ ప్రాంతాలలో సాధారణంగా కనిపించే సోకిన చిగ్గర్ మైట్స్ (లార్వా మైట్స్) కాటు ద్వారా వస్తుందన్నారు.

సాధారణ లక్షణాలు : ఆకస్మికంగా ప్రారంభమయ్యే అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి శరీర నొప్పులు, కండరాల నొప్పులు ,కొన్ని సందర్భాల్లో దద్దుర్లు, మైట్ కాటు జరిగిన ప్రదేశంలో ఒక లక్షణమైన "ఎస్చార్" (నల్లటి పొర లాంటి పాచ్) చలి, అలసట, అప్పుడప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుందని అని అన్నారు. సమాజాన్ని అప్రమత్తంగా ఉండి, నివారణ చర్యలను చర్యలను డాక్టర్ కోటిరెడ్డి సూచించారు. అలాగే ముఖ్యంగా చేయవలసినవి పొలాల్లో లేదా అటవీ ప్రాంతాలలో పనిచేసేటప్పుడు పూర్తి చేతుల దుస్తులు, పొడవాటి ప్యాంటు ధరించాలని. బహిర్గతమైన చర్మం, దుస్తులపై కీటక వికర్షకాలను ఉపయో గించాలని, పరిసరాలను ఉంచాచాలని, నేలపై పడుకోవద్దని సూచించారు. ముఖ్యంగా అటవీ/క్షేత్ర ప్రాంతాలను సందర్శించిన తర్వాత జ్వరం 2 రోజులకు పైగా కొనసాగితే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని కోరారు.

చేయకూడనివి : దీర్ఘకాలిక జ్వరం లేదా శరీర నొప్పులను విస్మరించవద్దని. వైద్యుడిని సంప్రదించకుండా స్వీయ వైద్యం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఏదైనా జ్వరం కేసులను వెంటనే నివేదించాలని మరియు నిఘా, అవగాహన, వెక్టర్ నియంత్రణ కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఆరోగ్య బృందాలకు సహకరించాలని, సమస్య లను నివారించడానికి ముందస్తు చికిత్స చాలా ముఖ్యం అని అన్నారు. స్క్రబ్ టైఫస్‌కు నిర్ధారణకు ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి సూచలనలతో మన ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్ష చేయుటకు కిట్స్ అందుబాటులో ఉన్నాయని డా కోటిరెడ్డి సూపరింటెండెంట్ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీలు

నిల్వల్లో తేడాలు... అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు

కందిపప్పు, నూనె లెక్కల్లో వ్యత్యాసం... పాల రిజిస్టర్ నమోదు శూన్యం

420 మంది విద్యార్థులకు అందుబాటులో ఉన్నది 10 మరుగుదొడ్లే..!

విశాలాంధ్ర-అడ్డతీగల : మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భనలో పాఠశాల నిర్వహణలో పలు లోపాలు, సరుకుల నిల్వల్లో అవకతవకలు బయటపడ్డాయి. ప్రస్తుతం వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీమతి జి.నాగమణి ఇక్కడ వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్నారు.

నిల్వల్లో వ్యత్యాసాలు : ఎంపిడిఓ స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించగా పలు సరుకుల లెక్కల్లో తేడాలు గమనించారు. కందిపప్పు రిజిస్టర్ ప్రకారం 32 కిలోల 500 గ్రాములు ఉండాల్సి ఉండగా, తూకం వేయగా కేవలం 30 కిలోల 180 గ్రాములు మాత్రమే ఉంది. నూనె రిజిస్టర్ లో 40 ప్యాకెట్లు చూపించగా, పరిశీలనలో 36 ప్యాకెట్లు మాత్రమే ఉన్నాయి. ఇతర సరుకులు అయిన చింతపండు, బెల్లం నిల్వలు పూర్తిగా నిల్ అని తేలింది. పాల పంపిణీకి సంబంధించి ఈనెల 1వ తేదీ నుండి ఇప్పటి వరకు స్టాక్ రిజిస్టర్‌లో ఎటువంటి నమోదు చేయకపోవడం గమనార్హం. బియ్యం మాత్రం 6185 కిలోలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. పాఠశాలలో మొత్తం 420 మంది విద్యార్థినులు ఉండగా, వారికి సరిపడా మౌలిక వసతులు లేవు. పాఠశాల ఆవరణలో మొత్తం 46 టాయిలెట్స్ ఉండగా, వాటిలో కేవలం 10 మాత్రమే పని చేస్తున్నాయి. అలాగే వాష్ రూమ్స్ 34 మాత్రమే వాడుకలో ఉన్నాయి. సిబ్బంది విషయానికి వస్తే 7 మంది వర్కర్లకు గాను, 5 గురు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఈ సమస్యల గురించి ఇప్పటికే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని వార్డెన్ తమకు తెలిపారని ఎంపిడిఓ ఎ వి వి కుమార్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాల పట్ల నిర్లక్ష్యం వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలో మొట్టమొదటిగాసారిగా బ్లాక్ బెల్ట్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన అనన్య

- **జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయం**
- **బ్లాక్, బ్రౌన్, గ్రీన్ బెల్ట్ సాధించిన విద్యార్థులకు అభినందన సభ**
- **శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ**

విశాలాంధ్ర-ఎటపాక : ఏజెన్సీ అల్లూరి జిల్లాలో బ్లాక్ బెల్ట్‌లో జిల్లా టాపర్‌గా పునుగు పాటి అనన్య నిలిచారు. తెలంగాణ పరిధిలోని ఖమ్మం జిల్లా కేంద్రంలో సుమన్ చోట కాన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఎటపాక మండలం తోటపల్లి శ్రీఆదిత్య స్కూల్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ వనపరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీ ఆదిత్య పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొని గతంలో వారు సాధించిన బెల్టులు అధిరోహించి మరో స్థాయిలో చేరారు. దీంతో పాఠశాల యాజమాన్యం అభినందించారు. విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిగత భద్రత అవసరమని, సమాజంలో పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయని, రక్షణ కరువైందని, అందుకే ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నట్టు శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ కడియాల వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం చదువు మాత్రమే కాదని భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు కరాటే దోహదపడుతుందన్నారు. గత ఐదేళ్లుగా ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ప్రతీ ఏటా పోటీల్లో విద్యార్థులు పాల్గొంటూ వారి ప్రతిభ చూపుతున్నారని గుర్తు చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని సాయి అనన్య బ్లాక్ బెల్ట్ సాధించిన రికార్డ్ నెలకొల్పిందన్నారు. అల్లూరి జిల్లాలో మొదట బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థిగా నిలిచిందన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని దీప్తి బ్రౌన్ బెల్టు, మూడో తరగతి విద్యార్థి రోహిత్ గ్రీన్ బెల్ట్ సాధించారన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తగిన విధంగా స్పందించి పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి అన్నీ విషయాలపై అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కరాటేలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ మల్లిక, శ్రీనివాసరావు, సంధ్య, ప్రసన్న జ్యోత్స్న, వరలక్ష్మి, నమృత, నాగేంద్రమ్మ, శివదేవి ఇమాన్సి, వెంకటలక్ష్మి, జయంతి, వాసవి శివాని, శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వైసిపి నాయకుల ప్రత్యేక సమావేశం

- **కోటి సంతకాల కార్యక్రమంపై దిశ నిర్దేశం**
- **పిలుపునిచ్చిన ఎమ్మెల్యే మత్స్యలింగం**

విశాలాంధ్ర-అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ నియోజకవర్గానికి సంబంధించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో తన క్యాంపు కార్యాలయంలో ఈనెల 9వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు అరకులోయ శాసనసభ్యులు రేగమత్స్యలింగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల ఉద్యమం కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలను చైతన్య పరచి ఈ కార్యక్రమం మరింత విజయవంతం అయ్యేవిధంగా కృషి చేయడంలో భాగంగా ఈ సమావేశం జరుపుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశంలో నియోజకవర్గానికి చెందిన వైసిపి జెడ్పిటిసిలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, నియోజకవర్గస్థాయిలో వైసీపీ అనుబంధ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ప్రముఖంగా చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్య నాయకులు,కార్యకర్తలు, అభిమానులు వైసీపీ బలోపేతమే దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి యథావిధిగా సీలేరు, భద్రాచలం బస్సు సర్వీసులు

విశాలాంధ్ర-సీలేరు : విశాఖపట్నం నుంచి సీలేరు, భద్రాచలం ప్రాంతాలకు గతంలో రద్దు చేసిన బస్సు సర్వీసులను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ విశాఖపట్నం డివిజనల్ మేనేజర్(డిఎం) మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్తవీధి మీదుగా సీలేరు వెళ్లే భద్రాచలం బస్సులతో పాటు, నైట్ హాల్ట్ చేసే సర్వీసులను కూడా యథావిధిగా నడవనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సర్వీసులకు రిజర్వేషన్ సదుపాయం కూడా కలదని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. గత కొన్ని రోజులుగా బస్సుల రద్దుతో ఇబ్బందులు పడ్డ ప్రయాణికులకు ఈ నిర్ణయం పెద్ద ఊరనివ్వనుంది.

ప్రజా దర్బార్ నిర్వహణ

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : కురుపాం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సోమవారం గుమ్మలక్ష్మీపురం క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే కి వివరించి వినతులు అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓర్పుతో విన్న ఎమ్మెల్యే జగదీశ్వరి , ప్రతి వినతిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అభ్యర్థనలన్నీ ప్రభుత్వాధికారులకు పంపించి తక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను స్వయంగా పర్యవేక్షిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

టీకాల ప్రక్రియ సక్రమంగా జరగాలి : జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: చిన్నారులకు ప్రభుత్వం వేస్తున్న టీకాల ప్రక్రియ సక్రమంగా జరగాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వై. విజయ్ మోహన్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద బండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్సీ లో ఉన్న డిప్ ఫ్రీజర్‌తో పాటు ఇమ్మునైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. చిన్నారుల కోసం అందుబాటులో ఉన్న టీకాల వివరాలు వాటి యొక్క కాలపరిమితి ఉపయోగించే తీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈనెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఇప్పటి నుంచే సమర్థవంతంగా సిద్ధం కావాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్లు భద్రపరిచే విషయంలో అశ్రద్ధ వద్దని, ఎప్పటికప్పుడు ఫ్రీజర్ పనితీరు పరిశీలించి విద్యుత్తులో వోల్టేజ్ హై వోల్టేజ్ వంటివి పరిశీలిస్తుండాలని అన్నారు. వ్యాక్సిన్ కిట్లను సక్రమంగా భద్రపరుచుకోవాలని, ఐస్ ప్యాక్ లు వాటి యొక్క సమర్ధత పరిశీలించాలన్నారు. శాస కార్యక్రమాల ద్వారా అనుమానిత కేసులను గుర్తిస్తే వారికి తక్షణమే మెరుగైన వైద్యం కోసం పంపించాలని వైద్యులకు తెలిపారు. ఆయన వెంట పి హెచ్ వైద్యులు జి ధరణి, పిఎల్ గోపాలకృష్ణ,హెచ్ వి జయలక్ష్మి, ఎంపిహెచ్ఈఓ వెంకట్ నాయుడు సిబ్బంది ఉన్నారు.

శక్తి టీంలు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం ఎఎస్పీ, శక్తి టీమ్స్ నోడల్ ఆఫీసర్ మనీషా వంగలరెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్ 1&2 పోలీస్ అధికారులు, సిబ్బంది సోమవారం పార్వతీపురం రూరల్, టౌన్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్, పోక్సో చట్టం 2012, గుడ్ టచ్, బాడ్ టచ్, నిర్భయ చట్టం, ఆరోగ్యంపై, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రారంభించిన "అభ్యుదయం సైకిల్ యాత్ర" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడి విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శక్తి టీమ్ ఇంచార్జి, ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు మాట్లాడుతూ అభ్యుదయం సైకిల్ యాత్ర అనేది సమాజంలో అవగాహన, ఆరోగ్యం, భద్రత, సామాజిక బాధ్యత అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి నిర్వహించే ఒక సైకిల్ ర్యాలీ కార్యక్రమమని అన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చే ప్రక్రియలో అనేక అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే యువత భవిష్యత్తును కాపాడేందుకు విద్యాసంస్థలను మత్తురహిత ప్రాంతాలుగా మార్చడం అవసరమన్నారు. గంజాయి అమ్మినా, కలిగివున్నా, తరలించినా నేరమేనని తెలిపారు. గంజాయి ఇతర అసాంఘిక కార్యక్రమాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే 1972కు, 100/112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేసారు. మహిళల భద్రతపై, పిల్లల రక్షణ (పోక్సో చట్టం) పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యు. గురుమూర్తి, మహిళా కానిస్టేబుళ్లు రామలక్ష్మి, నిర్మల శక్తి టీమ్ 1&2 పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామ శివారులో ఇటికీ బట్టీ వద్ద జూదాం ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ జి కళాధర్ తన సిబ్బందితో ఆదివారం శిబిరంపై దాడి చేసి ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 43500 నగదు స్వాధీనం చేసుకున్నారు, నిందితులపై కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం ఎస్సై జి కళాధర్ తన సిబ్బందితో రేగులపాడు సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేసి పెండింగ్ చలానా వసూలు చేశారు, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా వాహనం నడిపేటప్పుడు హెల్మెంట్ ధరించవలనని వాహనదారులకు తెలిపారు, సరైన ధ్రువీకరణ పత్రములు లేనివారికి అపరాధ రుసుము వేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా మూర్తి పోలీస్ కృష్ణమూర్తికి శోభిత వర్మ సేవా పురస్కారం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కొమిరి కృష్ణ మూర్తి ప్రతీ నెలా తనకు వచ్చే జీతంలో కొంత మొత్తాన్ని పేదలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఆపదలో ఉన్న వారికి ఖర్చు చేస్తూ యెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న పోలీస్ కృష్ణమూర్తికి రాజమహేంద్రవరం శోభిత వర్మ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శోభిత వర్మ సేవా పురస్కారాన్ని సరస్వతి జ్ఞాన మందిరంలో స్పెషల్ కమాండ్ ఫోర్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కొండా నరసింహారావు, డిఎస్పి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఎస్.వి కళాకారుల సేవా సంఘం నిర్వాహకులు సి.హెచ్ శ్రీనివాస్ వర్మ తదితరులు ఘనంగా సన్మానించారు.

అంగన్వాడీ వర్కర్ల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఈనెల 12వ తేదీన కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాను జయప్రదం చేయాలి : సిఐటియు

విశాలాంధ్ర-పెదబయలు : మండలం లోగల 23 గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్లు, మినీలు ఆయాలు యొక్క దీర్ఘకాలికమైన సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు సోమవారం అంగన్వాడి వర్కర్లు హెల్పర్లతో కలిసి స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కి మెమోరను ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లు సుదీర్ఘ కాలమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల ఈనెల 12వ తారీఖున అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముట్టడిస్తామని అన్నారు రాష్ట్రంలో పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగటం లేదనారు అంగన్వాడీలకు వేతనాలు పెంపు తదితర సమస్యలు పరిష్కారం చేయాలని 2023 డిసెంబర్లో 42 రోజులు పాటు చారిత్రాత్మకమ సమ్మె జరిగిందని సమ్మె ముగింపు సందర్భంగా 2024 జూలైలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని యూనిట్స్ ఇచ్చారు. అయినా నేటి వరకు వేతనాలు పెంచలేదు రాష్ట్రంలో ఇటీవల 4689 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇచ్చి నందుకు అభినందనలు ఇంకా 1810 మినీ సెంటర్లో క్వాలిఫికేషన్ లేదని మెయిన్ సెంటర్లుగా మార్చలేదు కొంతమంది మినీ వర్కర్లు 10 తరగతి పాసై మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేయలేదు గ్రాడ్యువిటీ జీవో నెంబర్ 8ను సుప్రీంకోర్టు గైడెన్స్ రూపొందించలేదు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు, హెల్పర్లు ప్రమోషన్లు రాజకీయ జోక్యం వలన అర్హులకు ప్రమోషన్లు రావడం లేదు, సెంటర్ నిర్వహణలో ఇచ్చిన ఫోన్లు పనిచేయటం లేదు వర్క్ చేయటానికి అనేక ఇబ్బందులు అంగన్వాడీ వర్కర్లు పడుతున్నారు ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం ఇస్తున్న స్నాక్స్‌ని ఆపి వేశారు. అంగన్వాడీలు కనీస వేతనం 26,000 ఇవ్వాలని పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్షనిచ్చి మెయిన్ సెంటర్లకు మార్చాలని హెల్పర్ ప్రమోషన్లు నిర్దిష్టమైన గైడెన్స్ రూపొందించాలని అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్ని యాప్లు కలిపి ఒకే యాప్ మార్చాలని సెంటర్ నిర్వహణకు 5జి ఫోన్లు ఇవ్వాలని ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని గ్రాడ్యుటి అమలుకు గైడెన్స్ రూపొందించాలని వేతనంతో కూడిన మెడికల్ లీవ్లు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు అలాగే లబ్ధిదారులకు ఆయిల్ కందిపప్పు క్వాలిటీ పెంచాలని, ఉచితంగా గ్యాస్ సర్ఫర్ చేయాలి ప్రీస్కూల్ బలోపేతం చేయాలి ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలుచేయాలని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడి సెంటర్‌లోనే ఉండాలని జీవో ఇవ్వాలని అన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని ఈ సందర్భంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు లేనియెడల ఈనెల12 తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి జిల్లా కలెక్టర్ ఆఫీసులో జరిగేటటువంటి ధర్నాకు అధిక సంఖ్యలో అంగన్వాడి వర్కర్లు ఆయాలు పాల్గొని సమస్యల పరిష్కారం కోసం కదలి రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు టి రాజమ్మ, జీ.మాదమ్మ సిహెచ్ కొండమ్మ సిహెచ్ పార్వతమ్మ, చిన్నమ్మి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయముతోనే రైతు సంక్షేమం

ఆంధ్రప్రదేశ్ బి.సి. సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ

విశాలాంధ్ర-పార్వతీపురం : తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో గత పదిరోజులుగా సబల్ - రైతు సాధికార సంస్థ బయో గ్రామాల అభివృద్ధి విభాగం ద్వారా సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి. పారి నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ కళారూపకాల శిక్షణా కార్యక్రమం ముగింపు ఉత్సవం సోమవారం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ జట్టు ట్రస్టు మరియు రైతు సాధికార సంస్థ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ కళారూపాలను అభ్యసిస్తున్న కళాకారులకు అవసరమైన కాస్ట్యూమ్స్ అందజేసి వారికి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వపు వ్యవసాయ విధానాలతోనే రైతు సంతోషంగా ఉండేవారని, అధికడిగుబడుల కోసం తాపత్రయపడి రసాయన వ్యవసాయ విధానాలు అవలంభించడంతో వ్యవసాయ సాగు ఖర్చులు పెరిగి నికరాదాయం తగ్గడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని, ఇప్పుడు అన్ని రకాల పంటలు విషాలతో కలుషితమయ్యాయని దీనితో నేల, రైతుల ఆరోగ్యాలు పాడవ్వడంతో పాటు, వ్యవసాయ రంగం కుదేలైందని అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించడం ద్వారా మాత్రమే మళ్ళీ రైతు సాధికారత సాదించి ఆనందంగా ఉండగలడని అన్నారు .రాష్ట్ర స్థాయిలో ప్రకృతి సేద్యాన్ని ఉన్నతమైన పనిగా భావించి విస్తరణకు కృషిచేయాలని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని కోరారు. కొండబారిడి అంటే ఉద్యమాలకు నిలయంగా ఉండేది ఇప్పుడు ప్రకృతి వ్యవసాయ ఉద్యమానికి నిలయంగా మారడం సంతోషదాయకమని అన్నారు. ప్రకృతి వ్యవసాయ బయో గ్రామాల సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి పారి నాయుడు గారు మాట్లాడుతూ వెయ్యి మాటలు చెప్పలేని విషయాలను ఒక పాటలో చెప్పవచ్చునని, రైతులకు, మహిళలకు ప్రకృతి వ్యవసాయం చేరువచేయడానికి కళారూపాలు దోహదపడతాయని, స్వచ్ఛంద సంస్థలు, సేవకులు, కార్యకర్తలతో పాటు కళాకారులు ప్రకృతి వ్యవసాయ వ్యాప్తికి కృషి చేసినప్పుడే నూరు శాతం ఫలితాలు పొందగలమని అన్నారు. బయో గ్రామాల కల్చరల్ కన్సల్టెంట్ శ్రీరౌతు వాసుదేవరావు మాట్లాడుతూ శత శాతం ప్రకృతి వ్యవసాయం అమలు జరగాలంటే ప్రకృతి వ్యవసాయ విధానాలు, పద్ధతులు సరళమైన పదాలతో ఆట పాటలు ద్వారా రైతులకు చేరేవేయడం ఒక విశిష్టమైన మార్గమని గుర్తించి అలాంటి కార్యక్రమం రూపొందించడం ద్వారా రైతు సాధికార సంస్థ రైతాంగానికి మేలు జరుపుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిలబస్ కన్సల్టెంట్ శివాజీ, జట్టు ట్రస్టు ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహరాజ్, కో డైరెక్టర్ ఎమ్. నూకం నాయుడు,సబల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శిరీష, బయో గ్రామాల అభివృద్ధి జూనియర్ కన్సల్టెంట్ పి. ఉమా మహేశ్వరి, కల్చరల్ కన్సల్టెంట్ వి. సన్యాసిరావు, మార్కెటింగ్ కన్సల్టెంట్ వి.టి. విరాజిత కళాకారులు మరియు జట్టు ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బూర్జలో బిటి రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని బూర్జ గ్రామంలో శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర చేతులమీదుగా మంగళవారం బీటీ రోడ్డు శంకుస్థాపన చేస్తారని టీడీపీ ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాలనాయుడు, బూర్జ గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు కళ్యాణ బలరాంలు తెలిపారు.అన్నిగ్రామాలనుండి టీడీపీముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు.

ఐటీడీఏ పిజిఆర్ఎస్‌కు 37 వినతులు

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏలో సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశం మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉద్యానవన శాఖ పీహెచ్ఓ వెంకట గణేష్ నిర్వహించారు. ఈపిజిఆర్ఎస్‌కు గిరిజనులు వివిధ సమస్యలపై 37 వినతులు సమర్పించడం జరిగిందని తెలిపారు. ఐటీడీఏ ఎదురుగా పేదలకు మంజూరు చేసిన గృహ నిర్మాణాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీతంపేట మండలం గడిగుడ్డి గ్రామస్తులు వినతి సమర్పించారు. అదేవిధంగా చినబగ్గ గ్రామానికి చెందిన రైతులు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి అవసరమైన యంత్రాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వాహిని, జీసీసీ మేనేజర్ డి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అయ్యేరక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-కురుపాం : రాష్ట్ర అయ్యేరక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ కురుపాం నియోజకవర్గ అయ్యేరక సంఘం ప్రతినిధులు సోమవారం రాష్ట్ర బి.సి వెల్ఫేర్ కమీషనర్ బి.సత్యనారాయణ ను తోటపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగా అయ్యేరక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ మరియు డైరెక్టర్లను నియమించీ కూటమి ప్రభుత్వం అయ్యేరక కులస్తులకు సముచిత గౌరవం కల్పించాలని కోరారు. అయ్యేరకల జీవన స్థితిగతులు, ఆర్థిక వెనుక బాటు వివరించారు.. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డొల్లు పారినాయుడు మాస్టర్ మార్కొండ వాసుదేవరావు, తోటపల్లి దేవస్థానం చైర్మన్ మార్కొండ ఫకీరునాయుడు కురుపాం పీఏసీఎస్ చైర్పర్సన్ డొల్లు కిషోర్ కుమార్ మరియు తామర ఫకీర్ నాయుడు పాల్గొనడం జరిగింది.

మంథా తుఫాను వలన నష్టపోయిన రైతులకు రుణమాఫీ, నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-బెలగాం : మంథా తుఫాను వలన నష్టపోయిన రైతులకు రుణమాఫీ, నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్వీఎస్ కుమార్ లు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు, నవంబరు నెలల్లో సంభవించిన మంథా తుఫాను వర్షాల వలన జిల్లాలో నష్టపోయిన పంటలు వరి, మొక్కజొన్న, ప్రత్తి రైతాంగాన్ని ఆదుకోవాలని, నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.50,000 లు నష్టపరిహారం చెల్లించాలని, రైతులు వ్యవసాయ మదుపులు నిమిత్తం బ్యాంకులలో వాడుకున్న రుణాలను మాఫీ చేయాలని, వరి, ప్రత్తి, మొక్కజొన్న పంటలకు అధిక మద్దతు ధరలు ప్రభుత్వం ప్రకటించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ ప్రకటించిన ధరకే కొనుగోలు చేయాలని, ధాన్యం తూకవ ప్రభుత్వ ప్రకటించే క్రమంలోనే తూనికలు ఉండాలని అన్నారు. అలాగే కురుపాం గుమ్మలక్ష్మీపురం మండలాల గిరి శిఖర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు మైదాన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సింహాద్రి దుర్గారావు, నిమ్మక గోపాల్, బిటి నాయుడు, లక్ష్మయ్య, కురుపాం గుమ్మలక్ష్మీపురం గిరిజన రైతులు మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు తిరుమల సాయి పాఠశాల విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని పెదమే రంగి కూడలిలో గల తిరుమల సాయి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నిమ్మల జితేంద్ర ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి అండర్ 14 విభాగంలో ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి తెలిపారు. ఇటీవల విజయనగరంలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. కాగా ఈ రాష్ట్రస్థాయి పోటీలు రైన్ బో ఉన్నత పాఠశాల నెల్లూరు జిల్లాలో ఈనెల 9 10 11 తేదీలలో జరగనున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల నిర్వాహకులు రౌతు వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు ఎస్ శంకరరావు బోధన బోధ నేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

యుటిఎఫ్ నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆశ్రమ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయంవద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీ మోహనరావు డిమాండ్ చేశారు. 8వతేదీ వచ్చిన ఇప్పటికీ వీరికి నేరాలు చెల్లించక పోవటం దారుణమన్నారు. జీతాల హెడ్ ఆఫ్ అకౌంట్ నంబర్ల సరి చేయాలని చెప్పి జీతాలు తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె భాస్కరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండగ ముందు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవటం సరికాదని, మిగిలిన యాజమాన్యాల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు చెల్లించక పోవటం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు వి జ్యోతి, జిల్లా కార్యదర్శులు ఎన్ శ్రీనివాసరావు, కె.గోవిందమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ పి.బృందావనరాయుడు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాదచారుడు మృతి

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ మండల పరిధి పణుకువలస కూడలిలో సోమవారం రాత్రి పాదచారి నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో పాదచారుడు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు స్థానిక ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు మృతుడి ఆచూకీ ఇంతవరకు తెలియ రాలేదని అన్నారు పాలకొండ పోలీసులకు 6309990871 ఈ సెల్ ఫోను నెంబర్ కు మృతుడి వివరాలు తెలిస్తే సంప్రదించాలని కోరారు.

విత్తన బిల్లును వ్యతిరేకిద్దాం...

జీవో కాపీలు దగ్ధం...

విశాలాంధ్ర-పాలకొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నూతన విత్తన చట్టం రైతాంగానికి హాని కలిగించే బిల్లు అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితిఅప్పలనాయుడు పేర్కొన్నారు రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపులో భాగంగా స్థానిక కార్గిల్ జంక్షన్లో సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విత్తన బిల్లు ప్రతులను దగ్ధం చేశారు ఈ బిల్లు పై రైతులు రైతు సంఘాలు అభిప్రాయాలు కోసం ఆరు నెలలు గడువు పెంచాలని నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతే పరిహారము ఎవరు ఇస్తారు అని స్పష్టంగా చెప్పాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు విత్తన కంపెనీలు తమ విత్తనాలను ప్రభుత్వ సంస్థల ద్వారానే ధ్రువీకరణ తప్పనిసరిగా పొందాలని అన్నారు విత్తన ధరలు మరియు సరఫరా ఇవి అన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలి అని డిమాండ్ చేశారు యావత్తు రైతాంగం అభిప్రాయ సేకరణ జరిగిన తరువాతే పార్లమెంటు లో ఆమోదం పొందాలని అన్నారు లేని పక్షములో వ్యవసాయ రంగం పూర్తిగా సర్వనాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వాలు రైతుల మనుగడకు రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలి గాని రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తే ఎంతటి ప్రభుత్వాలు అయినా కూలిపోవడం తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వావిలపల్లి రమణమూర్తి కిమిడి రామ్మూర్తి నాయుడు వీరన్న నాయుడు అరసాడ శ్రీనివాసరావు గోపాలరావు దుర్గారావు సాంబమూర్తి అనేకమంది పట్టణానికి చెందిన గ్రామీణ ప్రాంతానికి చెందిన రైతులు కవులు రైతులు రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఒడిశా సంక్షేమం వద్దు... ఆంధ్ర సంక్షేమమే ముద్దంటున్న కొఠియా ప్రజలు

విశాలాంధ్ర-సాలూరు : వివాదాస్పద ఎఓబి సరిహద్దు కొఠియా గ్రూపు గ్రామాలలో ఒడిశా ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు మనలో ఏ ఒక్కరూ తీసుకోవద్దని ఆయా గ్రామాల ప్రజలు తీర్మానించుకున్నారు. ఈ మేరకు మండలంలోని పట్టు చెన్నూరు, పగులు చెన్నూరు పంచాయితీల పరిధిలోని గిరిజనులు చోడిపిల్లి బిసు తదితర గిరిజన నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పట్టు చెన్నూరులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసుతో పాటు పలువురు మాట్లాడారు. మనమంతా ఆంధ్ర ప్రదేశ్ తో కలిసి ఉందామని, ఒడిశా రాష్ట్రానికి చెందిన పింఛన్లతో పాటు ఏ ఇతర సంక్షేమ పథకాలను అందుకోరాదని అనగా, అంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతేకాకుండా ఒడిశా అధికారులు పట్టు చెన్నూరు గ్రామంలో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చూస్తున్నారని, ఇప్పటికే ఎగువ కొఠియాలో ఉన్న ఒడిశా పోలీస్ స్టేషన్ తో ఇబ్బందులు పడుతున్నామని, కావున ఏపీ ప్రభుత్వం, అధికారులు స్పందించాలన్నారు. పట్టు చెన్నూరులో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తే తమకు అనేక ఒత్తిడులు ఎదురవుతాయని, ప్రజలను మధ్యపెట్టి తమ వైపునకు తిప్పుకొనేందుకు ఒడిశాకి అవకాశం ఉందని, కావున ఆంధ్రా అధికారులు అడ్డుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఇది ఇలా ఉండగా కొఠియా గ్రూపు గ్రామాల పేరుతో 21గిరిజన గ్రామాలు ఏపి, ఒడిశా రాష్ట్రాల మధ్య దశాబ్దాల కాలంగా వివాదస్పదంగా ఉండటం, వాటిపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్టేటస్కో అమల్లో ఉండటం తెలిసిందే. అయినప్పటికీ ఒడిశా పాలకులు, అధికారులు తరచూ ఏపీ అధికారులను అడ్డుకోవడం వారికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై కేసులు పెట్టడం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో వీరు సమావేశమై పై విధంగా నిర్ణయించుకున్నారు. పగులు చెన్నూరు, పట్టు చెన్నూరు పంచాయితీల మధుర గ్రామాలతో పాటు గంజాయి భద్ర పంచాయితీ పరిధిలోని ధూళి భద్ర తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శించడం వైకాపా వారికి అలవాటే : మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు : పార్వతీపురం మన్యం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో మంత్రి సంధ్యారాణి లేరని వ్యంగ్యంగా మాట్లాడే వారు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని మంత్రి సంధ్యారాణి అన్నారు. సోమవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో ఆమె మాట్లాడుతూ ఉధ్బవ్ -2025 జాతీయ వేడుకలు ముగింపు కార్యక్రమానికి హాజరవ్వమని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు భారీ గిరిజన సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొన్నానని తెలిపారు. ఈ ఉత్సవాలకు 22 రాష్ట్రాల నుండి 450 ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు సుమారు 1800 మంది హాజరయ్యారన్నారు. అంతటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రిగా హాజరుకావడంతో ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనలేదన్నారు. విషయంపై పూర్తి అవగాహన లేకుండా ముగ్గురు మాజీ ప్రజాప్రతినిధులు తమకు తోచిన రీతిలో మాట్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. విద్యార్థులకు మౌళికవసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వసతిగృహ విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు,స్టీల్ ప్లేట్స్, క్రీడా కిట్లు, స్టేషనరీ, కొత్త టాయిలెట్లు, 42 పాఠశాలల మరమ్మత్తులకు నిధులు కేటాయించామన్నారు. గత ప్రభుత్వం లో గిరిజన అభివృద్ధికి పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. గిరిజన ప్రాంత రహదారులు, భవనాలకు 1300 కోట్లు కేటాయించామన్నారు. అభివృద్ధి చూసి అసహనంతో వైకాపా నాయకులు మండి పడుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి స్క్రిప్ట్ బాగా రాసి ఇవ్వాలని లేకపోతే ఏది రాసిస్తే అది చదివేస్తారని ఎద్దేవా చేశారు. సామాన్య గిరిజన మహిళ అయిన తనపై 25 నిమిషాలకు పైగా అబద్ధాలు మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలిపెడుతున్నానని తెలిపారు. సాలూరు నియోజకవర్గం ఎవరి హయాంలో అభివృద్ధి పథంలో నడుస్తున్నది ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏరియా ఆసుపత్రి నిర్మాణానికి అదనపు నిధులు తీసుకువచ్చి నిర్మాణ పనిని పూర్తి చేస్తున్నామన్నారు.పరకామణి సేవలో 72 వేల రూపాయలు దొంగిలించడాన్ని జగన్మోహన్‌రెడ్డి చిన్న నేరంగా పరిగణించారని కానీ నిందుతుడు పెద్ద నేరమని ఒప్పుకుంటూ కన్నీళ్ళు కార్చుతూ సెల్ఫీ వీడియోని సామాజిక మాధ్యమాలలో విడుదల చేశారన్నారు. దేవుడి సొమ్ము రూపాయి అయిన అది తీవ్ర నేరంగా పరిగణించాలన్నారు.వేలాది కోట్ల రూపాయలు మింగేసిన జగన్‌రెడ్డికి 72 వేల రూపాయలు చిన్న తప్పుగానే కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యానారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, మక్కువ మండల పార్టీ అధ్యక్షుడు గుళ్ళ వేణుగోపాల నాయుడు,పాచిపెంట మండల పార్టీ నాయకుడు గూడెపు.యుగంధర్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుడిపై తేనెటీగల దాడి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోని జమ్మిడివలస గ్రామానికి చెందిన మూడట్ల విశ్వనాథం అనే వృద్ధుడిపై ఏకకాలంలో తేనెటీగలు దాడి చేశాయి. ఎప్పట్లాగానే తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకునేందుకు విశ్వనాథం సోమవారం వెళ్లి, పనులు చేస్తున్న వేళ ఒక్కసారిగా తేనెటీగలు ఆయనపై మూకుమ్మడి దాడి చేశాయి. సుమారు 70ఏళ్ల వయసులో ఉన్న విశ్వనాథంపై 300 దాడి చేయడంతో ఆయన తీవ్ర అనారోగ్యానికి లోనై గాయాల పాలయ్యాడు. తేనెటీగలు బలంగా దాడి చేయడంతో విశ్వనాథం ను సమీపంలో గల బందలుప్పి పీహెచ్సీకు చికిత్స కోసం తరలించారు. పీహెచ్సీ వైద్యులు శంకర్రావు తక్షణమే స్పందించి తేనెటీగల దాడికి గురైన విశ్వనాథంకు చికిత్స అందించి, శరీరంలో గుచ్చుకున్న కొన్ని తేనెటీగల పళ్ళు ముళ్ళు తొలగించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు.

సమిష్టి కృషితో స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుదాం

టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మణరావు, చిట్టిబాబు

విశాలాంధ్ర-చింతపల్లి: సమిష్టి కృషితో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొందామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చల్లంగి లక్ష్మణరావు, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు అన్నారు. ఆ పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, మరో సీనియర్ నాయకుడు బండి రమణ లతో కలిసి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వరాలన్నారు. నాడు వైసీపీ పాలనలో సంక్షేమ మంటూ అభివృద్ధిని విస్మరించారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇచ్చిన ఎన్నో హామీలను వైసీపీ ప్రభుత్వం విస్మరించిన విషయం ప్రజలకు తెలుసన్నారు. సంక్షేమ పథకాల పేరిట ప్రజలను ఏమార్చి వైసీపీ పాలకులు, నాయకులు అందినంత దోచుకున్నారన్నారు. వై నాట్ వన్ సెవెంటీ అంటూ కొత్త పల్లవి అందుకున్న వైసీపీ కి సార్వత్రిక ఎన్నికలలో విజ్ఞులైన ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పారన్నారు. అధికారంలో ఉండి సార్వత్రిక ఎన్నికలలో ప్రతిపక్ష హోదా కూడా సాధించ లేని ఏకైక ప్రభుత్వం వైసీపీ అని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. పాలనానుభవం గల చంద్రబాబు నాయుడు వలననే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలుసుకున్న ప్రజలు కేంద్ర, రాష్ట్రాలలో కూటమి ప్రభుత్వాలకు అవకాశం కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుల నాయకత్వంలో రాష్ట్రం శర వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకుండా సర్పంచ్ లను సైతం బిక్షాటన చేయించిన ఘనత వైసీపీ కే దక్కుతుందన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ లకు పుష్కలంగా నిధులు మంజూరు చేసి సర్పంచ్ ల ద్వారా పంచాయితీ ల అభివృద్ధి కి అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. ఈ విధంగా స్థానిక సంస్థల ద్వారా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను జోడెడ్ల మాదిరిగా ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీలు బలపరచిన సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బహుళ జాతి సంస్థలకు కొమ్ముకాసే ప్రభుత్వాలతో కార్మిక లోకం పోరాటం

సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి :బహుళ జాతి సంస్థలకు కొమ్ము కాసే ప్రభుత్వాలతో కార్మిక లోకం పోరాటం చేస్తుందని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు, ఆటో కార్మికులచే సిఐటియు 18వ అఖిలభారత మహాసభల గోడపత్రికను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల ఆస్తులను కేంద్ర ప్రభుత్వం దానిని బలపరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు, బహుళ జాతి కంపెనీలకు, ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెబుతున్నారని మండిపడ్డారు, ప్రధానిగా నరేంద్ర మోడీ హయంలో దాపరికం లేకుండా గుండు గుత్తగా బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఆయిల్ కంపెనీలు, ఉక్కు ఫ్యాక్టరీలు, రక్షణ సంస్థలు మొత్తాన్ని ఈ దేశ పెట్టుబడుదారుల్లో ప్రథమ స్థానంలో ఉన్న అంబానీ, ఆదాని, టాటా లకు లక్షల కోట్ల రూపాయల విలువ ఉన్న ప్రజల ఆస్తులను కారు చౌకగా కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు. కమ్యూనికేషన్లు, ఆయిల్ కంపెనీలు అయితే అంబానికి, విమనాశ్రయాలు పోర్టులు ఆదానికి, ఎయిర్ ఇండియా విమానాలను టాటాలకు రాసిపెట్టి ఉన్నాయని ఈ రోజుల్లో చిన్న పిల్లలు కూడా చెప్పగలుగుతున్నారన్నారు, 100మంది అత్యంత ధనికులుగా ఉన్న వీరికి 2021నాటికే 57 లక్షల కోట్ల రూపాయల సంపదతో బాగుపడగా దేశ జనాభాలో అడుగున ఉన్న 50% మందికి జాతీయ సంపదలో కేవలం ఆరు శాతం వాట మాత్రమే దక్కిందని, ప్రైవేటీకరణకే పరిమితం కాకుండా ప్రజల డబ్బులతో నిర్మితమైన రైల్వేలు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, పోర్టులు, విద్యుత్ తీగలు మరియు సబ్ స్టేషన్లు మొదలైన ప్రజల జీవనానికి ఆధారంగా ఉన్న మౌలిక సౌకర్యాలు అన్నిటిని, ఆదాని, అంబానీలకు వాటి విలువలలో 10 నుండి 15 శాతానికి లీజుకు రాసి ఇవ్వాలని నిర్ణయించిందన్నారు, ఈ విధానాల వలన భవిష్యత్తులో పిల్లలకు ఉద్యోగాలు దొరకవని, రిజర్వేషన్లు ఉండవని, సంఘటిత రంగంగా ఉన్న ప్రభుత్వ రంగం కనుమరుగైతే విస్తారంగా ఉన్న కోట్లాదిమంది అసంఘటితరంగ కార్మికులకు ఆధారం లేకుండా పోతుందని ప్రజలపై భారాలు పెరుగుతాయని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఏడాదికి మూడు లక్షల 76 వేల కోట్ల రూపాయలు డివిడెంట్లు, పన్నుల రూపంలో వస్తున్నాయనీ, ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి బహుళ జాతి సంస్థలకు కొమ్ముకాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులు పోరాటం చేస్తున్నారని అన్నారు. కాల పరిమితి ఉద్యోగాలు ఇకనుండి ఉంటాయని దీని ద్వారా చెప్పకనే చెప్పారని, కార్మికులకు బానిసగా బహుళ జాతి సంస్థలకు అండగా నిలబడి ఈ ప్రభుత్వాలు పరిపాలిస్తున్నాయని మండిపడ్డారు, ఈ తరుణంలో కార్మిక వర్గానికి పోరుబాటగా నిలబడ్డ సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు విశాఖపట్నం కేంద్రంగా డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు 5 రోజులపాటు జరగనున్నాయని, దేశ నలుమూలల నుంచి కాకలు తిరిగిన కార్మిక పోరాట యోధుల తో పాటు దేశ విదేశాల నుంచి కూడా కార్మిక ప్రతినిధులు రానున్నారని, జనవరి 4న జరిగే లక్షలాది మందితో ఆర్కే బీచ్ లో బహిరంగ సభను కార్మిక వర్గం జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు ఈశ్వరరావు, రాములమ్మ, చంటిబాబు, ఆటో యూనియన్ ప్రతినిధులు సంపరి రమణ, రామకృష్ణ, ప్రసాద్ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

హిడ్మా హీరో మీరెందుకు జీరో: భారత్ ఆదివాసీ పార్టీ

విశాలాంధ్ర -సీలేరు : హిడ్మా హీరో అయితే మీరెందుకు జీరో అయ్యారు, అవుతున్నారని ఆదివాసీ మాజీ, తాజా ప్రజాప్రతినిధులను భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు సూటిగా ప్రశ్నించారు. ఆదివాసీ సామాజిక పరిస్థితుల కారణంగా హిడ్మా బుల్లెట్ ని నమ్మితే అదే ఆదివాసీ సామాజిక పరిస్థితుల కారణంగా ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాలెట్ ని నమ్మి రాజకీయాల్లోకి వచ్చి గెలిచి ఐదేళ్లలో జీరో అవుతున్నారని, గతంలో రెండు, మూడు దఫాలుగా ఎన్నికైనా వారు ఉన్నారని, ప్రస్తుతం మాత్రం నయా బ్యాచ్ ఉందని, వీరు కూడా పార్టీ అధినేతల పోటోలతో గెలిచిన వారేనని, గెలిచిన వీరు ఏజాతి నుండి వచ్చారో ఆ జాతి బాగోగులు గాలికి వదిలేసారని, అందుకే ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఏజెన్సీలో కొత్తముఖం వెలుగుతుందని, ఈ కొత్త ముఖాలు గతంలో ఎప్పుడు కనిపించనివని, వారికి ఆ పదవి వచ్చిన తర్వాత భూమ్మీద నిలబడరని, ఎంత తొందరగా కోట్లకు అధిపతి అవుదామని చూస్తున్నారే తప్పా, ప్రజల పక్షాన నిలబడటం లేదని, కోట్లకు అధిపతులై కోట్లు కుమ్మరిస్తామన్న ఓట్లు వేయడానికి ఆదివాసీలు సిద్ధంగాలేరన్న విషయాన్ని సదరు ప్రజాప్రతినిధులు తెలుసుకోవాలని,రాజ్యాంగ పరంగా ఆదివాసీలకు సక్రమించిన హక్కులు,చట్టాలు అమలు కాకుండా పోతుంటే కళ్ళుండి కబోదుల్లాగా, నోరుండి మూగవాళ్ళలాగ నటిస్తున్నారని,జిఓ 3 పోతే ఎంతమంది ప్రజాప్రతినిధులు ప్రతిస్పందించారని, భూబధాలయింపు నిషేధ చట్టం, పెసా చట్టం,అటవీ హక్కుల చట్టం గురించి ఎంతమంది నాయకులకు తెలుసునని,జిఓ నెం 3 సుప్రీంకోర్ట్ కొట్టేస్తే గత ప్రభుత్వం,ఈ ప్రభుత్వంలో ఉన్న ఆదివాసీ నాయకులు ఏం చేస్తే తమ జాతికి ఉద్యోగాలు వస్తాయని ఆలోచన చేస్తున్నారని, ఎంతసేపు ఎక్కడ దొరుతుందా దోసుకొందాం, దాసుకొందామనే తప్పా ఇంకో ఆలోచన లేదని ఎద్దేవా చేసారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆదివాసీ పార్టీ నాయకులు మద్దేటి అంజిరెడ్డి, వందా కృష్ణమూర్తి, కురసం సత్యనారాయణ దొర, బలిజే చిన్నారెడ్డి, కుంజం తమ్మన్న దొర, నక్కెల శ్రీనివాసరావు, కత్రం రామదాసు దొర, మడకం వెంకన్న దొర తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరణ ప్రయత్నాలు తగదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మన్మధరావు

విశాలాంధ్ర-కురుపాం : మధ్యాహ్న భోజన పథకాన్ని స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, గిరిజన సంఘం నాయకుడు మండింగి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కురుపాం ఎంఈఓ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్ సీపర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 156 ప్రభుత్వ పాఠశాలల్లో 22 ఏళ్లుగా కార్మికులు తక్కువ జీతాలతో, అప్పులు చేసి, అనారోగ్యాలను భరిస్తూ పిల్లలకు వేడి భోజనం అందిస్తున్నారని ఇప్పుడు ఈ వంట విధానాన్ని రద్దు చేసి మండలంలో ఒకే స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేసి వాహనాల ద్వారా భోజనం పంపిణీ చేయాలనుకోవడం గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగించడం లక్షల్లో కమిషన్ల కోసం చేస్తున్న ప్రయత్నమేనని ఆరోపించారు. వేలాది మంది విద్యార్థులకు ఒకే చోట వండి పంపడం అనేది అమలుచేయలేని, ప్రమాదకరమైన విధానమని మధ్యాహ్న భోజన కార్మికులు గత కొన్నేళ్లుగా సేవా దృక్పథంతో ఈ పథకం కొనసాగిస్తున్నప్పటికీ, వారికి కనీస వేతనాలు కూడా చెల్లించని ప్రభుత్వం ఇప్పుడు ఉపాధినే తొలగించడం మహిళలపై ద్రోహమని మండిపడ్డారు. సీపర్లకు గుర్తింపు కార్డులు, పనిముట్లు, పెండింగ్ జీతాలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ ఎన్.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో గిరిజన సంఘం నాయకులు సీతారాం, హరినాథ్, సంగం నాయుడు, సింహాచలం,మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ సీపర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్దేశించిన లక్ష్యంను అధిగమించాలి

మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.పైడితల్లి

వేతనదారుల సంఖ్యను పెంచాలి

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంతోపాటు వేతనదారుల సంఖ్యను పెంచాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి అన్నారు.మండల పరి షత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం మండల ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు మరియు క్షేత్ర సహాయకులతో నిర్వ హించిన సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో పైడితల్లి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సాంకేతిక సహాయకులు ముందస్తు కొలతలు ఇచ్చి పనులు చేయించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయ తీల పరిధిలో జరుగుతున్న మహా త్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ప్రస్తుతం వెయ్యి మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారని అయితే రోజువారి రెండు వేల మంది పైబడి వేతన దారులు పనుల్లో పాల్గొనేలా ఉపాధి హామీ పథకం అధికారులు తగు చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు.మస్తర్లు నిర్వహణ, పను లకు వచ్చే వేతనదారుల హాజరును ఎన్ ఎం ఎస్ యాప్ ద్వారా ఎప్పటి కప్పుడు పంపించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ మామిడి ఈశ్వర మ్మ, ఇంజనీరింగ్ సలహాదారులు డి తేజేశ్వరరావు, సాంకేతిక సహాయకులు కొట్నాన నిర్మల, ఎం ఉమా మహేశ్వరి, మరిశర్ల హరికృష్ణ, క్షేత్ర సహాయకులు నల్ల సూర్యనారా యణ, గాడి వెంకటనాయుడు, మండల ఫకీరునాయుడు, నగిరెడ్డి ఆదినారాయణ, బలగ మల్లేశ్వర రావు, బూరి దాలినాయుడు, మర్రాపు శంకర్రావు, బొద్దాన శంక ర్రావు, శివ్వాల సత్యనారాయణ, ఎం తిరుపతిరావు, ఎస్ నాగమణి, బొచ్చ లలిత, తెర్లి చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరం కావాలి

బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు : ఎస్పీ మనిషారెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మత్తు పదార్థాలకు బానిసై, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా సమాజాన్ని నాశనం చేస్తున్నారని ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వాటిని నిర్మూలించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని మన్యం జిల్లా ఎస్పీ మనీషా రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ, హోం శాఖ ఆదేశాలతో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ శ్రీకారం చుట్టిన ఈగల్ బృందం పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అభ్యుదయం సైకిల్ యాత్ర సోమవారం మండలంలోని నర్సిపురం గ్రామానికి చేరుకుంది. పాయకరావుపేట నుంచి ఇచ్చాపురం వరకు జరిగే ఈ సైకిల్ యాత్రను సాదరంగా ఎస్పి మనిషా రెడ్డి ఆహ్వానం పలికారు. సైకిల్ యాత్రలో పాల్గొన్న పోలీసులకు వీర తిలకం దిద్దుతూ పూలమాలలతో పూలవర్షం కురిపించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని ఉన్నత శిఖరాలు అందుకునేందుకు బాల్యం నుంచే పునాదులు వేసి అటువైపుగా అడుగులు వేయాలని సమాజం సిగ్గుపడేలా మద్యపానం మాదకద్రవ్యాలకు బానిస కావద్దని హితబోధ చేశారు. అనంతరం రూరల్ సిఐ పి రంగనాథం మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర డిజిజి సూచన మేరకు అధునాతన పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు డ్రోన్ల సహాయంతో తనిఖీలు చేయడము అనుమానిత ప్రాంతాల్లో పరిశీలించడము వాహనాల తనిఖీలు నిర్వహించడం చేపడుతున్నామన్నారు. డ్రగ్స్ కు బానిసైతే జీవితం ఏ విధంగా నాశనం అవుతుందో అన్నదానిపై విద్యార్థులతో కలిసి దృశ్య ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై సంతోషితో పాటు సీతానగరం ఎస్సై రాజేష గ్రామ పెద్దలు గొట్టాపు రమణ ఎంపీటీసీ విద్యార్థులు పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి తెప్పోత్సవం గురించి సమీక్ష

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : రెండవ భద్రాద్రి గారి పేరుగాంచిన మండలంలోని శ్రీ రామగిరి గ్రామములో వెలసి యున్న శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం రాబోవు ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థాన చైర్మన్ పెందుర్తి సుధాకర్ (సుధా) ఆధ్వర్యంలో దేవస్థానం కమిటీ గ్రామ ప్రజలు సమీక్ష నిర్వహించి చుట్టుప్రక్కల పరిసరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పురుషోత్తమాచార్యులు, సాయిబాబు ,కమ్మ చిచ్చు సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉన్నత స్థానంలో స్థిరపడాలి

విద్యార్థులకు ఎంపిడిఓ ఐ వి. లక్ష్మి సూచన

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మిపురం : ఏడు రోజుల ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక సేవా శిబిరం జె కె పాడు గ్రామములో పి ఓ రామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నప్పటినుండే సేవభావం కలిగి ఉంటే భవిష్యత్తులో ఉత్తమ పౌరులు జాతికి అందుతారని అన్నారు. ఎన్ ఎస్ ఎస్ లాంటి సేవా సంస్థలు మీలో ఉన్న సేవభావం వెలికి తీసి మంచి అలవాట్లను కలిగి ఉండేలా తీర్చుదిద్దుతుందని అన్నారు. విద్యార్థుల అలవాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ పి ఓ రామయ్య కళాశాల హిస్టరీ లెక్చరర్ కుమారి ఏ. శ్రీవాణి, బోటనీ లెక్చరర్ శ్రీ టి. సత్యారావు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య శిబిరంలో 180 మందికి సేవలు

విశాలాంధ్ర-వై.రామవరం : ఎన్టీఆర్ ట్రస్ట్ ఆద్వర్యంలో సోమవారం స్థానికఎంపీడీవోకార్యాలయంలోఉచితవైద్యశిబిరంనిర్వహించారు.రాజమండ్రి జీ ఎస్ ఎల్ ఆసుపత్రి నుంచి వచ్చిన వైద్యులు ఈ శిబిరం లో కంటి సంబంధిత,కాళ్ళ నొప్పులు,బీపీ, సుగర్ వంటి జనరల్ చెకప్‌లు నిర్వహించారు.మొత్తం 180 మందికి పరీక్షలు జరిపి మందులు అందించినట్లు ట్రస్టు మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కాంతారెడ్డి,నాయకుడు పల్లాల రమణారెడ్డి, కుప్పా శ్రీను, సాంబమూర్తి, కృష్ణా రెడ్డి స్థానిక హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

16 నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర- సీతానగరం: శ్రీవేణుగోపాలస్వామిలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల16నుండి జనవరి 14వరకు ధనుర్మాస ఉత్సవాలు జరుగుతాయని ఆలయప్రధానఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు టీటీడీ పారాయణకర్త శ్రీనివాసరావులు తెలిపారు. ముఖ్యమైన రోజుల గూర్చి తెలియజేస్తూ ఈనెల 18నగురువారంనాడు ఆశీర్వచన పాశురం, 24న బుధవారం ధూపం పాశురం, 31న బుధవారం విశేష పాశురం, జనవరి ఒకటన నవనీత ఉత్సవంజనవరి 3న దీపారాధన, జనవరి 8న గురువారంనాడు పూలంగిసేవ, జనవరి 11న కూడైరై విశేష ప్రసాద నివేదనం జరుగుతాయని చెప్పారు. దీంతోపాటు డిసెంబర్ 30న వైకుంఠ ద్వారదర్శనం, జనవరి 14న గోదారంగనాయకుల కళ్యాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆలయంలో జరిగే ధనుర్మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త దంపతులు చెలికాని వెంకట గోపాలకృష్ణ భారతిలు తెలిపారు. శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను ఘనముగా ప్రతి ఏటాఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర చింతపల్లి : ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు అన్నారు. చిన్న గెద్ద గ్రామంలోని సచివాలయం-2 లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వి ఆర్పిల కే శాంతి, పి పల్లవి ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ పనుల గుర్తింపు సమావేశానికి టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, జనసేన నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి లతో ప్రస్తుత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అనేక పనులకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇటువంటి అవకాశాలను జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారం ఫండ్స్, అమృత్ సరోవర్ లు, బౌండరీ ట్రెంచ్ లు, ల్యాండ్ డెవలప్మెంట్ తదితర పనులను గుర్తించడం జరిగిందని ఈ సందర్భంగా వీఆర్పీలు శాంతి, పల్లవి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు ముత్యం సత్యనారాయణ (పెద్ద), మంగులు, అధిక సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

విశాలాంధ్ర-పాలకొండ :ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పాలకొండ పిఎసిఎస్ పూర్వపు సీఈవో పాలవలస కృష్ణ కుమార్ మరియు పాలవలస రమేష్ కుమార్(ఉపాధ్యాయుడు)మాతృమూర్తి పాలవలస ప్రభావతమ్మ మృతి చెందడంతో ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఆయనతోపాటు వైకాపా నాయకులు పాలవలస ధవలేశ్వరావు వెలమల మన్మధరావు కడగల వెంకటరమణ తూముల లక్ష్మణరావు పల్ల భానుబాబు కోడం విజయకుమార్ టేకి రామకృష్ణ దుంపల రమేష్ బాబు పాలకొండ శిష్టకరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాసూరు శ్రీధర్ బాబు తదితరులు ఉన్నారు.

రేఖపల్లి గ్రామాన్ని పోలవరం ముంపులో చేర్చాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖపల్లి గ్రామంను ఒక యూనిట్‌గా తీసుకొని పోలవరం ముంపులో చేర్చాలి అని దవలేశ్వరం పోలవరం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వి. అభిషేక్ ఐఏఎస్‌ని సోమవారం అఖిలపక్ష నాయకులు, స్థానిక సర్పంచ్ కలవడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా చూస్తాను అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని రేఖపల్లి అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

వెలుగు ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలి : యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా, మక్కువ మండలంలో వెలుగు ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.గంగునాయుడు, వెలుగు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు దేవి మాట్లాడారు ప్రభుత్వం 5జి సిమ్ములు, ఫోన్లు ఇవ్వకుండా ఆన్లైన్ వర్కులు చేయమనడం వెలుగు ఉద్యోగులను తీవ్ర పని ఒత్తిడికి గురిచేస్తుందని తెలిపారు వెలుగులో నేటి వరకు యూనిఫారం గానీ, ఐడి కార్డులు గానీ ఇవ్వలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు వెలుగు ఉద్యోగులకు ఇస్తున్న జీతాన్ని నేరుగా ఉద్యోగుల ఖాతాలకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు హెచ్ఆర్ పాలసీ అమలు చేసి, అర్హులైన వివోఏలను సీసీలుగా ప్రమోషన్ అవకాశం కల్పించాలని, కనీస వేతనాల చట్టాన్ని అమలు చేసి జీతం ఇవ్వాలని ఈ సమస్యలపై అనేక దఫాలుగా ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయడంలో ముందుకు రావడంలేదని, ఇప్పటికైనా వెంటనే వెలుగు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని తెలిపారు. అలాగే ఈనెల 31 జనవరి 1, 2, 3, 4లో విశాఖలో జరిగే అఖిలభారత సిఐటియు మహాసభలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ -సీతంపేట /భామిని : మండలం ఘనసర గ్రామంలో శ్రీ విజయ మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్ వారిచే ఘనసర జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రతి ఒక్కరికి ఉచితంగా మందులు అందజేశారు అదేవిధంగా గ్రామంలో ప్రతి ఒక్క సేవా కార్యక్రమంలో అనిల్ కుమార్ ముందుండి నడిపిస్తారని అహర్నిశలు ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేస్తూ ఉంటారని స్థానిక ప్రజలు ఆనందాన్ని వ్యక్తపరిచారు..ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ సాయి శంకర్, టీడీపీ మాజీ ఎంపీపీ భూపతి ఆనందరావు, సచివాలయం సిబ్బంది, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన అభ్యుదయ సైకిల్ యాత్ర

కలెక్టర్, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ఏఎస్పీలు స్వాగతం

విశాలాంధ్ర-పార్వతీపురం: మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన అభ్యుదయ సైకిల్ యాత్ర బృందానికి పార్వతీపురం మన్యం జిల్లాలో జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ డివిజన్ ఏఎస్పీ మనీషారెడ్డి, సబ్ కలెక్టర్లు వైశాలి స్వప్నిల్ జగన్నాథ్ లు ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఘనస్వాగతం పలికారు పలికారు. అనకాపల్లి జిల్లా నుండి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయం సైకిల్ యాత్రను పాయకరావుపేటలో ప్రారంభించారు. అభ్యుదయ సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజలను, యువతను, విద్యార్థులను మమేకం చేసుకుంటూ పార్వతీపురం మన్యం జిల్లాలో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలనే సంకల్పంతో విశాఖపట్నం రేంజ్ పరిధిలో అభ్యుదయం సైకిలు యాత్రను సుమారు 1000 కి?మీ?ల దూరాన్ని పాయకరావుపేట నుండి ఇచ్చాపురం వరకు నిర్వహించేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని పోలీసు శాఖ నిర్వహించడం మంచి శుభ పరిణామమన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ అభ్యుదయ సైకిల్ యాత్రను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి సమాజంలో మార్పు కోసం ఒక దృఢ సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లా గా మార్చే ప్రక్రియలో భాగంగా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మీ చుట్టుపక్కల మిమ్మల్ని ప్రలోభ పెట్టి నాశనం చేయడానికి మీ చుట్టుపక్కలే కొన్ని దుష్టశక్తులు ఉన్నాయని వారు మిమ్మల్ని మభ్యపెట్టి ఉద్రేక పరచి గంజాయి మత్తులో దించడానికి చాలా మంది ఎదురు చూస్తున్నారన్నారు. సరదాగా చేసే పని జీవితాన్ని నాశనం చేస్తుందని గంజాయి సేవించడం, డ్రగ్స్ వాడటం వల్ల మన మెదడు మన ఆధీనంలో ఉండదని సమాజంలో పేరు ప్రతిష్టలు కూడా దెబ్బతింటాయని చదువు మీద ఆసక్తి ఉండదని చెప్పారు. దానివల్ల ఆర్థికంగా ఇబ్బంది పడి డబ్బులు కోసం తెలుసో తెలియకో నేరాలకు పాల్పడుతుంటామని వాటి వల్ల జీవితం సర్వనాశనం చేసుకుంటూ జైలు పాలు అవ్వాల్సి వస్తుందని వివరించారు. చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించి వారిలో చైతన్యం తీసుకు వచ్చి డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామని తెలిపారు. ఈసందర్బంగా జిల్లా కలెక్టర్, ఎస్ పి జిల్లా అధికారులు సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. మార్గ మధ్యలో ప్లకార్డులు చూపిస్తూ, డ్రగ్స్ పై నినాదాలు చేస్తూ, మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సుమారు 3000 మంది పైగా విద్యార్థులు,ప్రజలు, యువతతో మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలకు వ్యతిరకంగా నినాదాలు చేసారు. అనంతరం ర్యాలీ కన్యకా పరమేశ్వరి గుడి వెనుక ఉన్న కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సిఐలు కృష్ణారావు, రంగనాథ్ తదితర సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ ధర్నాకు అనుమతించండి

విశాలాంధ్ర-కురుపాం : ఈనెల 9వతేదీ రాష్ట్ర గ్రామ సహాయకులు సంఘం పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు కురుపాం మండల గ్రామ సహాయకులు వెళ్ళేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గ్రామ సహాయకులు సంఘం తరపున డిప్యూటీ తహశీల్దార్ సురేష్ కు వినతిపత్రం అందజేశారు.జిల్లా వీఆర్యే సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ గిరిజన ప్రాంతాల్లో ఆర్థిక సాధికారతకు దారితీస్తున్న బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

- బ్యాంకింగ్ సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆర్థిక చేరువను పెంపొందించడమే లక్ష్యం

- దేశవ్యాప్తంగా 'అర్థసూత్ర సంవాదం' కార్యక్రమాలు

విశాలాంధ్ర-అరకులోయ : భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (NBFC) అయిన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ (బజాజ్ ఫిన్‌సర్వ్‌లో భాగం) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం 'అర్థసూత్ర సంవాదం' ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాలకు చేరుకుంది. ఈ కార్యక్రమం భారతదేశ గ్రామాలు, దూర ప్రాంతాలు, బ్యాంకింగ్ సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆర్థిక చేరువను పెంపొందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం ఆర్థిక క్రమశిక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు ఆర్థిక మోసాలపై అవగాహన పెంచి, డబ్బు నిర్వహణలో మంచి పద్ధతుల గురించి ప్రజలకు మార్గనిర్దేశం చేస్తోంది. సోమవారం అరకు వ్యాలీ మండలంలోని చినలబుడు పంచాయతీ, గొందివలస గ్రామంలో 'అర్థసూత్ర సంవాదం' అనే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇదే జిల్లాలోని పాడేరు మండలంలోని మినిములూరు గ్రామంలో డిసెంబర్ 6న ఇదే తరహా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా 'అర్థసూత్ర సంభాద్' నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమానికి అరకూ మండల ఉపతహసీల్దార్ పంచాది గోవింద్, చినలబుడు పంచాయతీ సర్పంచ్ బి.ఉపేందర్, నాంది ఫౌండేషన్ ప్రతినిధి రాయవరపు వెంకటరావు తదితరులు హాజరయ్యారు. గొందివలస గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 75 మంది పాల్గొన్నారు. వీరిలో ఎక్కువ మంది సున్నిత గిరిజన వర్గాలకు చెందినవారు. బజాజ్ ఫైనాన్స్ యొక్క 'అర్థసూత్ర సంవాదం' కార్యక్రమం దేశం లోతట్టు ప్రాంతాల్లో ఆర్థిక అవగాహన మరియు సాధికారతను పెంచేందుకు రూపొందించిన సమగ్ర కార్యక్రమం. వ్యక్తిగత ఆర్థిక వ్యవహారాలను సులభంగా అర్థమయ్యేలా చేసి, ప్రజలు స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో ఆర్థిక నిర్ణయాలు తీసుకునేందుకు దోహదపడటం దీని ప్రధాన లక్ష్యం. సభను ఉద్దేశించి ఉపతహసీల్దార్ పంచాది గోవింద్ మాట్లాడుతూ "గ్రామస్తులు డబ్బు తీసుకోవడానికి వెళ్లే సరికి, తమ పొదుపులు ఎవరైనా ముందే తీసుకుపోయారన్న విషయం తెలిసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి మోసాలకు గురికాకండి. అవగాహన అనే ఆయుధం మనలను రక్షిస్తుంది. సేవింగ్స్, బడ్జెటింగ్ వంటి అలవాట్లు కుటుంబాల భవిష్యత్తును సురక్షితం చేస్తాయి" అని అన్నారు. అవగాహనే ప్రధాన రక్షణ అని హైలైట్ చేస్తూ చినలబుడు పంచాయతీ సర్పంచ్ బి. ఉపేందర్ మాట్లాడుతూ "విద్యాభావం దొంగలకు అవకాశం ఇస్తోంది. అంగుళిముద్రలను దుర్వినియోగం చేసి డబ్బులు తీసుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఏటీఎం కార్డులు ఉపయోగించే సమయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం" అని అన్నారు. అదే విధంగా, "బంధువులు, తల్లిదండ్రులు, పిల్లలతో ఈ విషయాలపై మాట్లాడండి. అవగాహనే మన బలంఅది మనను రక్షిస్తుంది, మోసగాళ్లను బలహీనపరుస్తుంది" అని పిలుపునిచ్చారు. నాంది ఫౌండేషన్ ప్రతినిధి రాయవరపు వెంకటరావు మాట్లాడుతూ "సులభంగా డబ్బు వస్తుందనిపిస్తే అది తప్పకుండా మోసమే. మీ బ్యాంక్ ఖాతాను ఇతరులకు ఉపయోగించనివ్వకండి. ఈ ప్రాంతంలో ఏపీకే ఫైళ్లున్న లింకులు నొక్కి చాలామంది నష్టపోయారు. ఉచితంగా డబ్బు రాదుఎవరైనా ఆశ చూపితే అది మోసం అని గుర్తుంచుకోండి" అని హెచ్చరించారు. బహుముఖ దృష్టితో రూపొందించిన ఈ ప్రచారంలో, ఆర్థిక మోసాలపై అవగాహనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడింది. సైబర్ మోసాలకు గాను 1930 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను గుర్తుంచుకోవాలని, ఎలాంటి మోసం జరగగానే వెంటనే ఫిర్యాదు చేయాలని

సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, నకిలీ వాట్సాప్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులు, అనుమానాస్పద APK ఫైళ్లు, తెలియని లింకులు క్లిక్ చేయకుండా ఉండాలని వివరించారు. వర్క్‌షాప్‌లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, సామాజిక సంభాషణల ద్వారా సేవింగ్స్ ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక రక్షణ ఏర్పరచుకోవడం, అప్పులు తీసుకోవడంలో జాగ్రత్తలు, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ మోసాలను గుర్తించడం వంటి కీలక అంశాలు పాల్గొనేవారికి వివరించారు. అదనంగా, ఆర్థిక క్రమశిక్షణ, జీవితంలో వచ్చే ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొనే ప్రతిభ పెంపొందించడంపై మార్గనిర్దేశం చేశారు. వాస్తవ జీవన ఉదాహరణలతో కూడిన ప్రాయోగిక జ్ఞానాన్ని కలిపి, ప్రజల్లో దీర్ఘకాలిక ఆర్థిక చైతన్యాన్ని పెంచడమే అర్థసూత్ర సంభాద్ లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని చుట్టుపక్కల ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, నిపుణుల సెషన్లు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాల ద్వారా మరింత విస్తరిస్తారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన బజాజ్ గ్రూప్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ సమాజ సేవలో నిమగ్నమై ఉంది. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధి మాట్లాడుతూ, "ఆర్థిక సేవల వ్యాపారానికి పెద్ద ప్రయోజనం ఉందిదేశ ఆర్థిక ప్రధాన ప్రవాహంలోకి చేరని ప్రజలను చేర్చడం. దేశవ్యాప్తంగా ప్రారంభించిన ఆర్థిక చేరువ కార్యక్రమం ద్వారా ఎక్కువ మంది ప్రజలను భారతదేశ అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడం మా లక్ష్యం" అని తెలిపారు.

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో రైస్ మిల్లర్ల దోపిడీని ప్రభుత్వ యంత్రాంగం అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం రైతులతో కలిసి చేపట్టేరు మిల్లర్ల దోపిడీని మిల్లర్ల సిండికేటను అరికట్టాలని రైతు లందరును ఆదుకోవాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు జిల్లాలో ఉన్న రైసుమిల్లర్లు అంతా క్వింటాకు 5 కిలోలు ధాన్యాన్ని అక్రమ వసూళ్లు చేస్తున్నారని అన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ రైతుల సమస్యలను స్థానిక అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని తమకు చెప్పినట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు నిబంధనలు ప్రకారమే మిల్లర్లు ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారని ఆయన వెల్లడించారు రైసుమిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకె ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గురిబిల్లి అప్పలనాయుడు జిల్లా అధ్యక్షుడు వెలమల సత్యనారాయణ ఉపాధ్యక్షుడు వావిలపల్లి రమణమూర్తి సంఘ నాయకులు జగన్నాథం సాంబమూర్తి సంగంనాయుడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలిపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలి

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు

విశాలాంధ్ర-జీకే వీధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిపి ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు అన్నారు. సోమవారం నాగదేవత ఆలయం వద్ద నిర్వహించిన గూడెం కొత్త వీధి మండలం పంచాయతీ నాయకులు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఇటువంటి వివాదాలకు తావు లేకుండా గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని ఇకనుండి గ్రామాలలో ఉమ్మడి కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముంగిట కి తీసుకు వెళ్లే విధంగా పార్టీ నాయకుల కార్యకర్తల సమన్వయం ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్నికల్లో పాల్గొనడం జరుగుతుందని అయితే తెలుగుదేశం పార్టీ మండలంలో మంచి పట్టు ఉన్నందువలన పార్టీని మరింత అభివృద్ధి మార్గాన్న తీసుకువెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని విభాగాల్లోనూ సమన్వయంతో గెలుపొందే విధంగా నాయకులు కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపే మండలంలో గెలుపు కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకులు కార్యకర్తలు తప్పనిసరిగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయా ప్రాంతాలలో ఉన్న నాయకులు మీ మీ ప్రాంతాలలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని గ్రామ గ్రామాన పార్టీ నాయకత్వాన్ని బలపరచాలని ఆమె కోరారు పార్టీ అధిష్టానం తీసుకుంటే నిర్ణయాలకు అనుగుణంగా పార్టీ నాయకులు కార్యకర్తలు పని చేయాల్సి ఉంటుందని మండలంలో తెలుగుదేశం పార్టీ పూర్తి స్థాయిలో బలోపేతం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు పాడి శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు పసుపులేటి రామకృష్ణ కొర్ర బలరాం ముక్కలు మహేష్ జుర్ర వెంకటి మొక్కలు కళ్యాణి కె నారాయణమ్మ ఎం ధారబాబు కె రాంబాబు బుజ్జిబాబు ఈశ్వరరావు ఎం శరబన్న దొర తో పాటు అన్ని పంచాయతీల నుంచి గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, శెట్టి రామారావు, మురళి సంతోష్, మాతే కామరాజ్, పంద్ర నూకరాజు,ప్రధాన కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్లాక్లిస్ట్‌లో... ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించని మిల్లర్లు : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్ ప్రక్రియలో నిబంధనలను పాటించని మిల్లర్లపై జిల్లా యంత్రాంగం కఠినచర్యలు తీసుకుంటామని, బ్లాక్ లిస్టులో పెడతామని జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి తెలిపారు.ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. అగ్నిమాపక భద్రతతో సహా కనీస ప్రాథమిక వసతులు, భద్రతా ప్రమాణాలు పాటించని మిల్లర్లను వెంటనే బ్లాక్లిస్ట్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక భద్రత విషయంలో మిల్లర్ల నుండి ఎటువంటి సానుకూల స్పందన లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కనీస నిబంధనలు పాటించకపోవడం పూర్తి నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. రైతులను గౌరవించని వారిని ఎవరినీ క్షమించేది లేదని గట్టిగా హెచ్చరించారు. నిబంధనలు పాటించని మిల్లులకు ఇప్పటి నుంచి ఎటువంటి వ్యాపారం రాకుండా నిరోధిస్తున్నట్లు తెలిపారు. ?కలెక్టర్ తన ఆకస్మిక పర్యటన ఆధారంగా ఇప్పటికే రెండు మిల్లులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బ్యాంకు గ్యారంటీ విషయంలో ఆలస్యంపై ఈమధ్యాహ్నానికి పూర్తి నివేదిక కావాలని ఆయన అధికారులను కోరారు. రైతులకు కొనుగోలు ప్రక్రియపై సరైన అవగాహన లేకపోవడం వల్ల అపోహలకు లోనవుతున్నారని కలెక్టర్ గుర్తించారు. దీనిపై తక్షణమే దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లు, రైతు భరోసా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల, వద్ద నిబంధనలు, ఎస్ఓపీ ప్రకారం తీసుకోవాల్సిన వివరాలతో కూడిన వాల్ పోస్టర్లను తప్పనిసరిగా అతికించాలి. గన్నీ బ్యాగులు ఇచ్చినందుకు సంబంధించిన డబ్బులు రైతు ఖాతాలో జమఅవుతాయన్న విషయాన్ని పీపీసీ సిబ్బంది రైతులకు స్పష్టంగా తెలియజేయాలి. లేకపోతే రైతులు డబ్బులు మిల్లర్లే తీసుకుంటున్నారన్న తప్పుడు భ్రమలో ఉంటారని పేర్కొన్నారు. పరిధిలో ఉన్న మిల్లులు, పీపీసీ సిబ్బంది, వ్యవసాయ అధికారులు, సివిల్ సప్లైస్ సిబ్బందితో కలిసి ప్రతి గ్రామంలో తక్షణమే ధాన్యం కొనుగోళ్లపై అవగాహన సమావేశాలు నిర్వహించాలి. అవగాహన కార్యక్రమంలో పూర్తి నిబంధనలను చదివి వినిపించాలని ఆదేశించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎంక్వయిరీ చెయ్యాలి. కాల్ సెంటర్ ఓపెన్ చేసి ఒక నెంబర్ ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చే బిల్లుల విషయంలో స్పష్టత పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఇచ్చే పస్తువుల వివరాలు, వాటి ధరలు స్పష్టంగా అర్థమయ్యేలా తెలుగులో వ్రాసి ఇవ్వాలి. కంప్యూటర్‌లో జనరేట్ చేసినదైనా, ఆన్‌లైన్ బిల్లు అయినా సరే, సమాచారం రైతుకు అర్థమయ్యేలా ఉండాలి. ఒకవేళ సిస్టమ్‌లో కుదరకపోతే చేతితో రాసి అయినా వివరాలను అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాధ్యతా రాహిత్యంగా ఉండి, సమావేశాలకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యస్వంత్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డి.ఎంసివిల్ సప్లై శ్రీనివాస్, డి.ఎస్.ఓ బాల సరస్వతి, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ అన్నపూర్ణ, జిల్లాలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

క్రికెట్ క్రీడాకారిణి కరుణ కుమారికి సత్కారం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : అంతర్జాతీయ అండర్ 19 క్రికెట్ టి20 ప్రపంచ కప్ 2025 విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన మన్యం బిడ్డ పాంగి కరుణాకుమారిని సోమవారం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ దుస్సాలువా కప్పి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా పంట్లమామిడి గ్రామానికి చెందిన పీవిటీజి కుటుంబంలో పుట్టి అంతర్జాతీయ స్థాయిలో రాణించి కప్పు గెలిచేందుకు కీలక పాత్ర పోషించడం నిజంగా చాలా ఆనందకరమైన విషయం అని ఈ గెలుపు అల్లూరి జిల్లాకు గర్వకారణం అని అన్నారు. పాంగి కరుణ కుమారి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి లేఖ పంపించామని తెలియజేశారు. పిఎం జన్మన్ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేస్తామని అలాగే ఆమె చదువుకునేందుకు కూడా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

హత్య కేసును చేధించిన పోలీసులు

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ మండలం బుక్కురు గ్రామంలో ఈనెల రెండవ తేదీన అనుమానస్పదంగా మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగి విఠల్ రావు కేసును చేదించినట్లు సిఐ ప్రసాదరావు తెలిపేరు విటల్ రావు మద్యానికి బానిస అయ్యి ఇంట్లో తరచూ గొడవలు జరగడంతో తండ్రి రామప్పదు కుమారుడుపై గొడ్డలితో తీవ్రంగా గాయపరచడంతో మృతి చెందాడని తెలిపారు గొడ్డలి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు హత్య చేసిన రామప్పడును అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించేమని పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పాలకొండ : సచివాలయ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అంకితభావంతో విధులు నిర్వహించి మెరుగైన సేవలు అందించాలని స్థానిక శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పాలకొండ మండల పరిధిలో చిన్న మంగళాపురం గొట్ట మంగళాపురం బుక్కురు గ్రామాలలో సచివాలయాల ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులంతా ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు ప్రభుత్వం అందిస్తున్నటువంటి పథకాలను సక్రమంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని కోరారు సమయపాలన వృత్తిపట్ల నిబద్ధత పెంచుకోవాలని సూచించారు అనంతరము గ్రామీణ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు అర్జీలు తక్షణమే పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గర్భాన సత్తిబాబు కిమిడి కాశీం నాయుడు కిమిడి దుర్గారావు ఎంపీపీ బొమ్మాలి భాను సుధాకర్ అప్పలనాయుడు శ్రీధర్ కూటమి నాయకులు కార్యకర్తలు సచివాలయాల సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : డిసెంబర్ 08, ?అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో స్థిరమైన ధర, అత్యుత్తమ గుర్తింపు లభించేలా జిల్లా యంత్రాంగం పటిష్టమైన ప్రణాళికలు రూపొందిస్తోందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. కాఫీ రైతులు, వ్యాపారులు, ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలతో సోమవారం నిర్వహించిన అవగాహన, చర్చా కార్యక్రమంలో కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కాఫీ ట్రేడర్స్ అందరూ కలిసి ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుంటే, దానికి చట్టబద్ధత కల్పించి, దాని ద్వారానే వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని కలెక్టర్ ప్రకటించారు. ఈ అసోసియేషన్ ద్వారా నాణ్యమైన పంటకు స్థిరమైన ధర లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ కాఫీ పంటను మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముకోవడానికి జిల్లాలో కాఫీ రైతు బజార్లను ఏర్పాటు చేయనున్నారు. కాఫీ రైతులు ముందుకు వస్తే, యూనిట్ వ్యయంలో 30% రాయితీతో యంత్ర పరికరాలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. వ్యాపారం చేసే ప్రతి ఒక్క ట్రేడర్ తప్పనిసరిగా కాఫీ ట్రేడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అరకు కాఫీ నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన పార్చిమెంట్ అందించాలని, పండ్ల సేకరణ నుండి తయారీ

వరకు అత్యున్నత ప్రమాణాలు పాటించాలని కోరారు. అరకు, డుంబ్రిగూడ మండలాల్లో బెర్రీ బోరర్ తెగులు ఆశించినందున, పంట సేకరణ, పల్పింగ్ మరియు డ్రైయింగ్‌లలో తగు జాగ్రత్తలు పాటించాలి. తెగులు నివారణకు సంబంధించిన వీడియోలను కాఫీ బోర్డు తరచుగా పోస్ట్ చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవో తిరుమాని శ్రీపూజ మాట్లాడుతూ జీసీసీ ద్వారా కాఫీ పండ్ల సేకరణ జరుగుతుందని, రైతులు కొనుగోలు కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, కాఫీ బోర్డు శాస్త్రవేత్తలు, రైతులు మరియు వ్యాపారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ మండలం గొట్ట మంగళాపురం సచివాలయ ఉద్యోగులపై శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ సోమవారం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులతో సమీక్షలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంలో నిధులు జమకాని రైతుల జాబితాను సచివాలయ సిబ్బందిని అడిగేరు మావద్ద వివరాలు లేవని సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు ముందుగానే నేను వస్తున్నానని సమాచారం ఇచ్చి రాని వారి జాబితాను మీ దగ్గర ఉంచాలని చెప్పినప్పటికీ ఇంతటి అలసత్వం ప్రదర్శించడం తగదని హెచ్చరించారు ఇలా అయితే ప్రజలకు తాము ఏ విధంగా న్యాయం చేస్తామని మండిపడ్డారు రైతులకు తాము ఏమి సమాధానం చెప్పగలమని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా సచివాలయాల సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు.